క్లుప్తంగా

ముదిరాజ్ జర్నలిస్టుల నియోజకవర్గ కమిటీ ఎన్నిక



ముదిరాజ్ జర్నలిస్టుల కమిటీ

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట నియోజకవర్గ ముదిరాజ్ జర్నలిస్టుల నూతన కమిటీని శనివారం సిద్దిపేటలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ గౌరవ అధ్యక్షుడు పాతర్ల వెంకన్న, గౌరవ సలహాదారు జీకురు పరమేశ్వర్ తెలిపారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా రామకృష్ణ(10టీవీ), ప్రధాన కార్యదర్శిగా భైరి సతీశ్(ఆంధ్రజ్యోతి), ఉపాధ్యక్షులుగా పడిగె వెంకట్(సాక్షి), రవి(మన తెలంగాణ), సత్యనారాయణ(ఈనాడు), సహాయ కార్యదర్శులుగా రాందేని అంజి(రాజ్‌న్యూస్), అందె అంకుష్ (జనంసాక్షి), బొగ్గుల సంతోష్‌కుమార్(సాక్షి), కోశాధికారిగా జక్కుల శ్రీకాంత్(సాక్షి), కమిటీ సభ్యులుగా రాజు(హెచ్ఎంటీవీ), శ్రీకాంత్ (6టీవీ), శ్రీనివాస్ (ఏబీన్యూస్), వెంకట్(టీన్యూస్), బాలేష(దిశ), తిరుపతి(సూర్య), లక్ష్మణ్ (నమస్తే తెలంగాణ) ఎన్నికయ్యారు. జర్నలిస్టుల శ్రేయస్సు కోసం నూతన కమిటీ కృషి చేస్తుందని అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని కేశనాయక్‌తండా, రామవరం గ్రామాల్లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను శనివారం ఎంపీపీ మాలోతు లక్ష్మి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రధాన కూడళ్లలో వెలుగు ఉండేలా హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసుకోవడం సంతోషకమన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు భానోతు రవీందర్, వనపర్తి స్వప్ననరేశ్, ఎంపీటీసీలు లింగాల శ్రీనివాస్, సాంబరాజు, మాజీ జెడ్పీటీసీ భీలునాయక్, వార్డుసభ్యులు, గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని ధర్మారెడ్డిపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కాసమొల్ల కనకయ్య కుటుంబ సభ్యులను శనివారం గజ్వేల్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు గుంటుకు రాజు, కల్యాణ్‌కర్ నర్సింగరావు, గోలి సంతోష్, నాగు ముదిరాజ్‌లు పరామర్శించి మనోధైర్యం కలిస్తూ రూ.17,500లు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జేజేల వెంకటేశం, వైస్ ఎంపీపీ బెల్దె కృష్ణ, నాయకులు షాయద్, తాహెర్, ఉమర్ పాల్గొన్నారు.

ఈవీఎం వినియోగంపై అవగాహన

హుస్నాబాద్: పట్టణంలోని 20, 21వ వార్డుల్లోని పోలింగ్ స్టేషన్ పరిధిలో శనివారం ఓటర్లకు ఈవీఎంల ద్వారా ఓటు హక్కు వినియోగంపై రెవెన్యూ అధికారులు అవగాహన కల్పించారు. ప్రతి ఓటరు ఈవీఎం ద్వారా ఓటు వేసే విధానంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సుహాసిని, జూనియర్ అసిస్టెంట్ కరీం ఉన్నారు.

ఘనంగా స్నాతకోత్సవం



కలర్‌ఫుల్ డ్రెస్‌లో మెరిసిపోతున్న విద్యార్థులు

వర్గల్(గజ్వేల్): స్నాతకోత్సవ వేడుకలతో మండలంలోని బొర్రగూడెం ప్రాథమిక పాఠశాల అలరారింది. పట్టాలందుకున్న విద్యార్థులు కలర్‌ఫుల్ డ్రెస్‌లో మెరిసిపోయారు. విద్యార్థులలో చదువుపై మరింత ఆసక్తి పెంపొందింపజేసేలా శనివారం ఈ సంబరాలు కొనసాగాయి. హెచ్ఎం భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు రాజేందర్‌రెడ్డి, సుధాకర్ బృందంగా నిర్వహించిన ఈ స్నాతకోత్సవానికి జెడ్పీటీసీ బాలూయాదవ్, ఎంపీపీ లతరమేశ్‌గౌడ్, సర్పంచ్ రాములు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాఠశాల నుంచి ఉత్తీర్ణులై వెళ్తున్న 5వ తరగతి విద్యార్థులకు ఈ కార్యక్రమం వేదికగా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. స్పందన చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఉపసర్పంచ్ శంకర్, కాంప్లెక్స్ హెచ్ఎంలు కనకరాజు, సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ కనకరాజు, వైస్ చైర్మన్ స్రవంతి పాల్గొన్నారు. వినూత్న కార్యక్రమాలతో విద్యార్థులకు చదువులపై ఆసక్తి పెంచుతున్న ఉపాధ్యాయులు అభినందనీయులన్నారు. పాఠశాల గ్రంథాలయానికి సుదీక్ష, ఆధ్యా అనే విద్యార్థినులు కథల పుస్తకాలు విరాళంగా అందజేశారు.

మండల అభివృద్ధికి కృషి చేస్తా

రాయపోలు(దుబ్బాక): మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని దౌల్తాబాద్ మండల జెడ్పీటీసీ రణం జ్యోతిశ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని ఇందుప్రియాల్‌లో మండల పరిషత్ నిధులు రూ.5లక్షలతో చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటరెడ్డి, సర్పంచ్ శ్యామల, ఎంపీటీసీ మల్లేషం పాల్గొన్నారు.

బీటీరోడ్డు నిర్మాణం ఎప్పుడో?

- నరకప్రాయంగా తండా రోడ్డు
- అంబులెన్స్ రాలేని దుస్థితి
- నిధులు మంజూరు చేయాలని స్థానికుల వేడుకోలు



అధ్వానంగా తండా రోడ్డు

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రభుత్వం గ్రామాలను ఆదర్శంగా మార్చడమే లక్ష్యంగా ముందుకెళ్తుంది. కానీ అది అన్ని గ్రామాల్లో అమలు కావడం లేదు. కొన్ని తండాల్లో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. బీటీ రోడ్డు వేయాలని తండావాసులు ఉన్నతాధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదు. దీంతో తండావాసులకు ఇబ్బంది తప్పడం లేదు.

అక్కన్నపేట మండలం పెద్దతండా గ్రామ పంచాయతీ పరిధిలోని తాళ్లతండా, అవకుంటతండాలకు బీటీరోడ్డు నిర్మాణం ప్రతిపాదనల్లోనే నిలిచింది. ప్రజాప్రతినిధుల, అధికారుల హామీలకే పరిమితమైంది. అసలే అంతంతమాత్రంగా ఉన్న మట్టి రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు చాలాచోట్ల గుంతలు ఏర్పడి బురదమయంగా మారింది. అయితే ఈ రెండుతండాలు కలుపుకొని సుమారుగా 20 ఇళ్లు ఉంటాయి. దాదాపు 80కిపైగా ఓటర్లు ఉంటారు. ఇక్కడా రాత్రి, పగలు ఏమైనా ప్రమాదాలు జరిగితే అంబులెన్స్ రావడం కష్టంగా ఉంటుంది. అదేవిధంగా కట్కూర్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్, అక్కన్నపేట మండలానికి వెళ్లేందుకు ఈ మట్టిరోడ్డు మార్గంగా మల్లంపల్లి, కేశవాపూర్, గొల్లపెల్లి, మంచినీళ్లబండ గ్రామాలతో పాటు పలు గ్రామాల ప్రజలు, రైతులు ప్రయాణిస్తుంటారు.

6 కిలో మీటర్లు ఇదే పరిస్థితి..

మల్లంపల్లి గ్రామ ఊరచెరువు మీదుగా తాళ్లతండా, అవకుంటతండా టూ కట్కూర్ వరకు దాదాపు 6కిల్లో మీటర్ల మేర ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ మట్టిరోడ్డు అత్యంత దూరభారాన్ని తగ్గిస్తోంది. దీంతో నిత్యం అనేక మంది రైతులు, ప్రజలు ద్విచక్రవాహనాలపై ప్రయాణిస్తువుంటారు. బీటీరోడ్డు నిర్మించి రవాణా సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులను కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..

తాళ్లతండా, అవకుంటతండా మీదుగా కట్కూర్ వరకు సుమారుగా 6కిలో మీటర్ల బీటీరోడ్డు నిర్మించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఇంకా ఎలాంటి నిధులు మంజూరు కాలేదు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.
–సదాశివరెడ్డి, పంచాయతీరాజ్ డీఈఈ

ఇబ్బంది పడుతున్నాం..



మా తండా మట్టి రోడ్డు ఇటీవల కురిసిన చిన్నచిన్న వర్షాలకే పూర్తిగా పాడైంది. కాలి నడకకు సైతం కష్టంగా మారింది. రోడ్డుపై గుంతలు ఏర్పడి వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉంది. బీటీ రోడ్డు నిర్మించాలని మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌లకు కలిసి విన్నవించుకున్నాం. బీటీరోడ్డు నిర్మించి ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నాం.
–గుగులోతు తిరుపతినాయక్, తాళ్లతండా

ఫొటోలకు ఫోజులు ఇవ్వడం సిగ్గుచేటు

ఎంపీ ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకరూరల్: బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి పనులు చేస్తే తామేదో చేసినట్లు ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఫొటోలు దిగడం సిగ్గుచేటని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామంలో శనివారం కుమ్మరి, రెడ్డిసంఘం, బేడబుడగ జంగాలు, మాదిగ ఫంక్షన్‌హాల్, మహిళా మండలి భవన నిర్మాణాలకు ఎంపీ ప్రభాకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఉప ఎన్నికల్లో మాయమాటలతో గెలిచి వందరూపాయల నిధులు కూడా తీసుకురాలేదని మండిపడ్డారు. మేము చేసే అభివృద్ధి పనుల వద్ద ఫొటోలు దిగుతూ ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నాడని మండిపడ్డారు. ఎన్ని జిమ్మిక్కులు చేసిన ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ప్రజలు బీఆర్ఎస్ వైపు ఉన్నారని, అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, సర్పంచ్ మంజుల, ఎంపీటీసీ మాధవి, పీఏసీఎస్ చైర్మన్ కైలాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో పూజలు

మండలంలోని పెద్దగుండవెల్లి గ్రామంలో రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఎంపీ ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజిరెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

పాత పెన్షన్ స్కీమ్ కొనసాగించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీమ్ కొనసాగించాలని ఈ నెల 16 నుంచి తెలంగాణ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో రథయాత్ర చేపడుతున్నట్లు జిల్లా అధ్యక్షుడు చేగురి దేవరాజ్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రథయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవరాజ్ మాట్లాడుతూ.. పాత పెన్షన్ సాధనే లక్ష్యంగా రథయాత్ర కొనసాగుతుందని ఉద్యోగ సంఘాలు మద్దతు ప్రకటించాలని కోరారు. టీఎన్జీవో డివిజన్ కార్యదర్శి జి.మోహన్, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ రవీందర్‌రావులు ఈ నెల జిల్లాకు వచ్చే రథయాత్రకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో టీఎస్సీపీఎస్ఈయూ రాష్ట్ర బాధ్యుడు బండి నర్సింలు, డివిజన్ అధ్యక్షుడు విష్ణు, కృష్ణ, లలిత, చంద్రకళ, సందీప్‌కుమార్, మునీందర్‌లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



మంత్రి హరీశ్‌రావుతో సమస్యలు విన్నవిస్తున్న కార్యవర్గం

సిద్దిపేటజోన్: తెలంగాణ మీ సేవా సంఘం అసోసియేషన్ ఆధ్వర్యంలో సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి హరీశ్‌రావును మీ సేవా ఆపరేటర్ల అసోసియేషన్ కార్యవర్గం సభ్యులు శనివారం కలిశారు. ఈ సందర్భంగా మీసేవ ఆపరేటర్ల సమస్యలపై మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ.. మీ సేవలో వచ్చే అరకొర కమీషన్‌లతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మీ సేవ ఆపరేటర్ల గౌరవ సలహాదారుడు పాల సాయిరాం, ఉపాధ్యక్షుడు సికిందర్, జనరల్ సెక్రటరీ మహేశ్, సెక్రటరీలు శ్రీకాంత్, కోశాధికారి శ్రీకాంత్ పాల్గొన్నారు.

టీఎన్జీఓల సమస్యల సాధనకు ముందుకు సాగుదాం



టీఎన్జీఓ సిద్దిపేట శాఖ కార్యవర్గం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర నాన్ గెజిటెడ్ ఆఫీసర్ల సమస్యల పరిష్కారానికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని సిద్దిపేట టీఎన్జీవోల కార్యవర్గ సభ్యులు ప్రకటించారు. శనివారం టీఎన్జీఓ యూనియన్ సిద్దిపేట జిల్లా ఎన్నికలు పబ్లిక్ సర్వెంట్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో నిర్వహించారు. సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా మూడోసారి గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శిగా కోమండ్ల విక్రమ్‌రెడ్డి, సహాధ్యక్షుడిగా నిమ్మ సురేందర్‌రెడ్డి, కోశాధికారిగా అశ్వక్ అహ్మద్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో టీఎన్జీవో ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బంది వచ్చిన, వెన్నంటే ఉన్నటువంటి మంత్రి హరీశ్‌రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. భవిష్యత్‌లో ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించే దిశగా ముందుకు సాగుతామన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



హుస్నాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు



జగదేవ్‌పూర్‌లో కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

హుస్నాబాద్: జీపీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాలకు చెందిన కార్మికులు మండల పరిషత్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ.. కార్మికులను పర్మనెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. సమ్మెకు మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, పద్మ మద్దతు పలికారు.

చేర్యాల(సిద్దిపేట): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం 10వ రోజుకు చేరింది. మండల పరిధిలో కార్మికుల సమ్మెకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసరి కళావతి, జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్, బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సిద్దయ్యలు మద్దతు తెలిపారు.

సిద్దిపేటరూరల్: తక్కువ వేతనాలు తీసుకుంటూ, నిరంతరం గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న జీపీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి భవానీరెడ్డి అన్నారు. శనివారం నారాయణరావుపేట మండల కేంద్రంలో కార్మికుల దీక్షకు రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి భవానీరెడ్డి, సిద్దిపేట నియోజకవర్గ నాయకులు చొప్పదండి చంద్రశేఖర్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల రాజీవ్‌ర్, నాయకులు పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: కార్మికులకు వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రంగారెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఐవోసీ వద్ద సమస్యల పరిష్కారం కోసం జీపీ కార్మికులు చేపట్టిన సమ్మెకు శనివారం ఆయన సంఘీభావం తెలిపారు.

కార్మికులను విస్మరిస్తున్న ప్రభుత్వం

చిన్నకోడూరు(సిద్దిపేట): కార్మికుల సంక్షేమాన్ని తెలంగాణ ప్రభుత్వం విస్మరిస్తోందని కాంగ్రెస్ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు డా.సూర్యవర్మ అన్నారు. శనివారం చిన్నకోడూరులో కార్మికుల సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండల కేంద్రంలో శనివారం పారిశుధ్య కార్మికులు సమ్మె శిబిరం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన వ్యక్తం చేశారు.

తొగుట(దుబ్బాక): కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో దీక్షలు నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులకు శనివారం ఆయన మద్దతు తెలిపారు.

మిరుదొడ్డి(దుబ్బాక): జీపీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, అందె, అల్వాల, చెప్యాల సర్పంచ్‌లు శంకర్, కిష్టయ్య లక్ష్మీయాదగిరి, అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని మోతె సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) దుబ్బాక నియోజకవర్గం ఇన్‌చార్జి అనాజీపూర్ సంజీవ్ కోరారు. మిరుదొడ్డిలో కార్మికుల సమ్మెకు శనివారం వేరు వేరుగా వారు సంఘీభావం తెలిపారు.

జీలుగ సాగుతో భూసారం పెంపు



చిన్న ఆరెపల్లి(ఎస్‌బీ)లో జీలుగ ప్రయోజనాలను రైతులకు వివరిస్తున్న ఏఈఓ మాధవి

గజ్వేల్‌రూరల్: పంటలను సాగుచేసే రైతులు నేలలో భూసారాన్ని పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని బయ్యారం క్లస్టర్ ఏఈవో మాధవి సూచించారు. మండల పరిధిలోని చిన్న ఆరెపల్లి(ఎస్‌బీ)లో రైతు రుక్మొద్దీన్ సాగుచేసిన జీలుగ పంటను శనివారం పరిశీలించి, రైతులకు పచ్చిరొట్ట సాగు, పీఎస్‌బీ వినియోగంతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు ఒకే రకమైన పంటను కాకుండా పంట మార్పిడి చేయాలని, రసాయన ఎరువులు వాడడంతో భూమిలో సారవంతం తగ్గుతుందని, ఈ నేపథ్యంలో జీలుగా, జనుము విత్తనాలు సాగుచేయడం ద్వారా భూసారం పెరుగుతుందన్నారు. పచ్చిరొట్ట పంటను 30-40 రోజుల మధ్య ఒక ఎకరం భూమిలో కలియదున్నడంతో ఎకరాకు సిఫార్సు చేసిన యూరియాలో ఒక బ్యాగును తగ్గించుకోవచ్చన్నారు. దీని ద్వారా సేంద్రియ పదార్థం, ఆకుపెంట(హ్యూమస్), నత్రజని పెరుగుతాయని, నేల సత్తువ, నిర్మాణ వృద్ధి చెందుతుందన్నారు.ఈ సందర్భంగా రైతులకు సాంకేతిక సలహాలు-సమాచారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట): పచ్చిరొట్ట ఎరువుతో భూసారం పెరుగుతుందని మండలంలోని కడవేర్గు క్లస్టర్ ఏఈఓ సమజాత అన్నారు. శనివారం కడవేర్గు గ్రామ రైతులకు పచ్చిరొట్ట ఎరువుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పచ్చిరొట్ట సాగు భూసారాన్ని పెంచుతుందన్నారు. జీలుగు పంట పెరిగిన తర్వాత పొలంలో కలియదున్ని సాగు చేస్తే మంచి దిగుబడిని సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యారంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ అన్నారు. ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు శనివారం జిల్లా కేంద్రంలో మానవహారం, నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ మొదటి సంవత్సరంలో 11 శాతం నిధులు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిదో సంవత్సరంలో కేవలం 6 శాతం నిధులు కేటాయించి, విద్యార్థులకు తీరని అన్యాయం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులను కల్పిస్తూ, పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్‌లను రిలీజ్ చేసి, ఖాళీగా ఉన్న 1,91,000 ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మెదక్ విభాగ్ కన్వీనర్ శ్రీనివాస్, జిల్లా కన్వీనర్ వివేక్‌వర్ధన్, నగర కార్యదర్శి పవన్, సతీశ్ పాల్గొన్నారు.

హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ బదిలీ

కొత్త కమిషనర్‌గా రాజశేఖర్

హుస్నాబాద్: హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.రాజమల్లయ్య బదిలీ అయినట్లు రాష్ట్ర మున్సిపాల్ శాఖ కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. అదేవిధంగా సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ ఎం.ఆర్ రాజశేఖర్ హుస్నాబాద్ మున్సిపాలిటీ కమిషనర్‌గా బదిలీ అయినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇక్కడ పని చేసిన మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా రెండుసార్లు మున్సిపల్‌కు జాతీయ స్థాయిలో అవార్డులు రావడానికి విశేషంగా కృషి చేశారు. 2021-22సంవత్సరంలో ఇంటి పన్నుల వసూల్ 96శాతం పూర్తిచేసి జిల్లాలోనే మున్సిపాలిటీని ఆదర్శంగా నిలిపారు.

పాఠశాలకు విరాళం

గజ్వేల్‌రూరల్: ఓ విద్యార్థిని తాను చదువుకున్న పాఠశాలకు దాచుకున్న డబ్బులను విరాళంగా అందించి దాతృత్వాన్ని చాటుకుంది. ప్రజ్ఞాపూర్‌లోగల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థిని అడెపు సంజన దాచుకున్న రూ.9వేల నగదును తన పుట్టినరోజు సందర్భంగా పాఠశాల హెచ్ఎం అనురాధకు విరాళంగా అందించారు. అదే విధంగా ఐఐటీ హైదరాబాద్‌లో ఇంజనీరింగ్‌లో సీటు పొందినట్లు తెలిపి తన వద్ద ఉన్న పోటీ పరీక్షలకు సంబంధించిన వివిధ రకాల 100 పుస్తకాలను పాఠశాల గ్రంథాలయానికి అందజేశారు.

పోషకాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలి

గజ్వేల్‌రూరల్: ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకొని ఆరోగ్యవంతులుగా ఉండాలని హెచ్‌పీసీఎల్ (హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్) మెదక్ ఏరియా సేల్స్ ఆఫీసర్ బల్‌రాంసింహ పేర్కొన్నారు. హెచ్‌పీసీఎల్ 49వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోగల ఆశాజ్యోతి కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను అందజేశారు. అనంతరం విద్యార్థులకు అన్నదానం చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ ధర్నాను విజయవంతం చేయండి

హుస్నాబాద్: గురుకుల పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 17న జిల్లా కేంద్రంలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.యాదగిరి ఒక ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని, అన్ని సొసైటీల్లో ఏకరూప పరిపాలన అమలు, అన్ని గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని తదితర సమస్యల సాధనకు చేపట్టి ధర్నాను విజయవంతం చేయాలని యాదగిరి పిలుపునిచ్చాడు.

◆ దాతల సాయం విద్యార్థులకు మేలు

నంగునూరు(సిద్దిపేట): దాతలు చేస్తున్న సాయంతో నిరుపేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఖానాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన మారబోయిన నవీన్ శనివారం నోట్‌బుక్స్, ప్యాడ్స్, స్టేషనరీ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్తవ్వ, ఐలేని సతీశ్‌గౌడ్, హెచ్ఎం సుధాకర్‌రావు, జయపాల్‌యాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ వీధి వ్యాపారుల సంఘం కమిటీ ఎన్నిక

దుబ్బాక: దుబ్బాక వీధి వ్యాపారుల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నట్లు దుబ్బాక నీలకంఠ సంఘం అధ్యక్షుడు మర్గాల సత్యానందం అన్నారు. శనివారం నీలకంఠ సంఘంలో ఆయన మాట్లాడుతూ.. వీధి వ్యాపారుల సంఘం కమిటీ అధ్యక్షుడిగా చింత శేఖరం, ఉపాధ్యక్షుడిగా చీర్లంచ ప్రభాకర్, కార్యదర్శిగా శంకర్, ఉపకార్యదర్శిగా రాములు, కోశాధికారిగా శ్రీనివాస్ ఎన్నికయ్యారన్నారు. ఎన్నికైన నూతన కమిటీ సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు.

◆ ఎమ్మెల్యే ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

తొగుట(దుబ్బాక): మండలంలోని ఘనపురం గ్రామ రైతులు శనివారం దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. కొమురవెల్లి మల్లన్న సాగర్ ఓపెన్ కెనాల్‌లో భూమి కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.13లక్షల నష్టపరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఈ క్రమంలో రైతులకు ఎకరాకు రూ.8లక్షలు చెల్లించగా మరో 5లక్షలు చెల్లించాల్సి ఉంది. కాగా శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో రైతులకు చెక్కులు పంపిణీ చేయాలంటూ ఎమ్మెల్యే ఆందోళన నిర్వహించిన విషయం తెల్సిందే. కాగా ఎమ్మెల్యే చొరవతో తమకు చెక్కులు అందాయని రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రం, బీజేవైఎం జిల్లా మాజీ అధ్యక్షుడు విభీషన్‌రెడ్డి, నాయకులు పరమేశ్, స్వామిరెడ్డి, కరుణాకర్, రైతులు పాల్గొన్నారు.

◆ డ్రైవింగ్ లైసెన్స్‌లకు 250 దరఖాస్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ కోసం మండల వ్యాప్తంగా 250 దరఖాస్తులు వచ్చినట్లు బీఆర్ఎస్ నాయకులు ఏర్పుల మహేశ్ శనివారం తెలిపారు. మండల పరిధిలో లైసెన్స్ లేని యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

◆ టీపీసీసీ ప్రచార కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కత్తి కార్తీక

దుబ్బాక: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రచార కమిటీలో కాంగ్రెస్ అధికార ప్రతినిధి కత్తి కార్తీకగౌడ్‌కు చోటు దక్కింది. కొంత కాలంగా దుబ్బాక నియోజకవర్గంలో ఆమె కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా పని చేస్తున్నారు. ప్రచార కమిటీలో ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా అధిష్టానం ఆమెకు కీలక బాధ్యతలు అప్పగించడంపై దుబ్బాక కాంగ్రెస్ నాయకులు దేవిరెడ్డి, సాయి, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ఆకునూరు గ్రామానికి చెందిన కడారి శ్రావణి, తోట సుధారాణిలకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.20వేలు, రూ.18వేలు చెక్కులను శనివారం చేర్యాల వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ తాటికొండ సదానందం అందజేశారు.

◆ అభినందన

గజ్వేల్: రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్‌గా నియమితులైన పులిమామిడి నారాయణను గజ్వేల్ నియోజకవర్గ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు చిప్పల యాదగిరి, దళిత సంఘాల నేతలు తుమ్మ శ్రీనివాస్, మన్నె కృపానందం, వేలూరి యాదగిరిలు శనివారం హైదరాబాద్‌లో కలిసి అభినందనలు తెలిపారు. నారాయణకు బాధ్యతలు అప్పగించిన సీఎం కేసీఆర్ సహకరించిన బీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

◆ ఎల్‌ఓసీ అందజేత

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ఆకునూరు గ్రామానికి చెందిన సోమిరెడ్డి జనార్దన్‌రెడ్డి కొంతకాలంగా ఓ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.లక్ష ఎల్‌ఓసీని మంజూరి చేయించి శనివారం జనార్దన్‌రెడ్డికి అందజేశాడు. కార్యక్రమంలో సోమిరెడ్డి రాంరెడ్డి, మండల యాదవ సంఘం అధ్యక్షుడు శేఖర్, నాయకులు ప్రశాంత్, వెంకటేశ్, ఉదయ్, సాయి, వేణు, రాజు, హేమంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రతిభా స్కాలర్‌షిప్‌ల పంపిణీ

బెజ్జంకి(సిద్దిపేట): ఇట్టిడి బాలవ్వ, రాంరెడ్డిల స్మారకార్థం వారి కుమారుడు రవీందర్‌రెడ్డి బెజ్జంకి మోడల్ స్కూల్ విద్యార్థులకు ప్రతిభా స్కాలర్‌షిప్‌లను శనివారం పాఠశాల ప్రిన్సిపాల్ హర్షిత్‌కౌర్ చేతుల మీదుగా అందజేశారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రతి క్లాసులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతి ఏటా అందిస్తామని రవీందర్‌రెడ్డి తెలిపారు. అనంతరం ఉపాధ్యాయుడు వేణుప్రసాద్ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం విద్యార్థులకు టై బ్యాడ్జ్, బెల్ట్‌లను అందజేశారు. కార్యక్రమాలలో ఎస్ఎంసీ చైర్మన్ కనగండ్ల తిరుపతి, లక్ష్మన్, తదితరులు పాల్గొన్నారు.

◆ ఇంటింటా చెత్త సేకరణ

తొగుట(దుబ్బాక): పదిరోజులుగా పంచాయతీ కార్మికులు సమ్మె బాట పట్టడడంతో మండల పరిధిలోని తుక్కాపూర్ సర్పంచ్ చిక్కుడు చంద్రం శనివారం చెత్త సేకరించారు. పంచాయతీ ట్రాక్టర్‌ను ఇంటింటికీ తీసుకెళ్లి చెత్త సేకరించి డంప్‌యార్డుకు తరలించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు సమ్మె చేయడంతో గ్రామాల్లో పారిశుధ్య వ్యవస్థ అధ్వానంగా మారిందన్నారు. ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరాడు.